# తెగిన సాలెగూడు

భూషణం ఆవూరికి తను భూషణాన్ననుకుంటాడు. కాని వూళ్ళోని చాలామంది అతనావూరికి భోషాణం అంటారు.

భూషణంతాత ఏముహూర్తాన వడ్డీవ్యాపారం ప్రారంభించాడోగాని, ఆనాటినుండి భూషణం నేటిదాకా. ఆ ఊళ్ళోని చాలా సంసారాలు ఆ భోషణంలో యిరుక్కుపోయాయి. ఆస్తుల్ని భూషణం వశంచేసిన వాళ్ళంతా, భూషణానికి డబ్బువిలువ తెలుసునని ఏకగ్రీవంగా అంగీకరించడంతో భూషణం ఆ ప్రాంతం కోపరేటివ్ రూరల్ బ్యాంకికి ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు.

కోపరేటివ్ రూరల్ బ్యాంకు ధ్యేయం చౌకవడ్డీకి గ్రామాలలోని రైతాంగానికి అప్పులందేలా చూడడమే అయినా, డైరక్టర్లకి విదపవలసింది విదిపి కీలుబొమ్మల్ని చేసి, తనకి అనువుగా బ్యాంకిని మలుచుకున్నాడు భూషణం. ఎట్లా అయితేనేం, అటు ప్రభుత్వండబ్బుకి, యిటు ప్రజలడబ్బుకి వారసుడై వెలుగుతున్నాడు.

రోజూ మాదిరే, భూషణం 'రాజువెడలె రవితేజము లరయగ' అన్నట్టు పొందూరు ఖద్దరుపంచి, లాల్చీ ధరించి, వేళ్ళ వుంగరాలు సవరించుకుంటూ, చేత వార్తాపత్రిక పట్టు

కుని వీధరుగుమీదకొచ్చి కవాచీబల్లమీద ఆసీనుడయ్యాడు. పేజీలు తిప్పుతూ అక్కడక్కడున్న బొమ్మల్ని చూస్తున్నాడు.

ఇంతలో వున్నట్టుండి, పంతులూ? అని పిలిచాడు.

లోపల హాల్లో చాపమీద కూర్చుని, డస్కు బల్లమీదికి వంగి, ఏవో రాసుకుంటున్న పంతులు చిత్తం వస్తున్నా! అంటూ కలం చెవిలో పెట్టుకుని, గోచీబిగించుకొని భూషణం ముందు వాలాడు.

పంతులు దాదాపు పాతికేళ్ళ క్రితంనుంచి భూషణం దగ్గర చిత్రగుప్తుడు. అప్పట్లో భూషణమే తన సొంతసొమ్ము జీతంగా యిచ్చాడు పంతులుకి. కాని బ్యాంకు పుట్టిన తరవాత బ్యాంకు పంతులుకి జీతం యిస్తోంది. పంతులు భూషణంపనే చేస్తున్నాడు.

ఏం చేస్తున్నావు పంతులూ? భూషణం అడిగాడు.

రేపటి బ్యాంకు మీటింగుకి డైరెక్టర్లకి నోటీసులు తయారుచేస్తున్నాను. ఈ వేళ నేనా అందజేసి సంతకాలు తీసుకోవాలిగా మరి

బ్యాంకుపని బాంకులో చెయ్యక యింటిదగ్గర ఎందుకు చేస్తావయ్యా నువ్వు?

ఇంట్లో బ్యాంకు వీధిలో బ్యాంకు తమదేగా, ఎక్కడ చేస్తే ఏంపోయిందిలెద్దురూ అన్నాడు పంతులుముసిముసినవ్వులు నవ్వుతూ.

నీ తస్సాదియ్యా! నువ్వూ మాంచి మాటకారివై పోయావ్,

అంతా తమచలవే.

అది సరేలేగాని, మన డైరెక్టర్ల తాలూకు లోన్ దరఖాస్తులన్నీ తీసి పైనపెట్టు. వాటడుగున మనవి– అంటె మన సొంతజనానివి పెట్టు. మిగిలిన తలమాసిన అలగాజనానివన్నీ తొక్కిపారెయ్. మనవాళ్ళ దరఖాస్తులు అయిపోవడంతోటే యింక బ్యాంకులో డబ్బులేదు, వచ్చేమీటింగులో మిగిలినవి చూద్దాం అంటాను నేను. మీటింగు క్లోజు. మన డైరక్టర్లూ మాట్లాడరు.

యింకెందుకు మాట్లాడతారు, వాళ్ళప్పులు శాంక్షన్ అయ్యాయిగా.

బాగా చెప్పావ్, పోయి నీపని చూసుకో.

లోపలికి పోబోయిన పంతులు చటుక్కునఆగి, అయ్యా సత్తెయ్యకాపు మనింటివైపే వస్తున్నాడు, ఏమిటంటారు సంగతి అంటూ కళ్ళజోడుని ముక్కుమీదికి దించి అల్లంతదూరంలో వున్న సత్తెయ్యని పరకాయించాడు.

యే సత్తెయ్యా?

ఇంకే సత్తెయ్య? యింకే సత్తెయ్యో అయితే చెప్పుకోడం దేనికి. మనసత్తెయ్యే. మీమీదబ్యాంకు ప్రెసిడెంటుకి పోటీచేయబోయి మానేసిన సత్తెయ్యే.

ఎన్నడూ తనపొలం, రాజవీధి, తన యిల్లుతప్ప మరో దారి తొక్కెరగని సత్తెయ్య మారుమూలగా, విడిగావున్న తన యింటికి వస్తున్నాడంటే ఎందుకోనని కాస్త ఆతృత వ్యక్త

పరిచాడు భూషణం. ఎందుకొస్తున్నాడు చెప్మా యిటు అని కాస్త సర్దుకుని కూర్చున్నాడు.

అలా యిదైపోకండి. బహుశా మన సాలిగూడుమీద వాలడానికేనేమో! బెదరగొట్టెయ్యకండి యిటు వస్తున్నాడు నే లోపలికెడితా అని పంతులు జారుకున్నాడు.

లోపలికెళ్లి అక్కౌంటుపుస్తకం తిరగేస్తూ చెవుల్ని అరుగుమీదికి వదిలిపెట్టాడు.

భూషణం పేపరు ముఖానికి అడ్డుపెట్టుకుని, కళ్లురోడ్డు మీదికి బీటువేశాడు.

సత్తెయ్య భూషణం యింటిని సమీపించి, అరుగువార నిలబడి, యింటిదగ్గరే వున్నావా ? యీపాటికి బ్యాంకుకి వెళ్లిపోతావేమో, దొరుకుతావో దొరకవో అనుకుంటూ వచ్చాను అన్నాడు సత్తెయ్య.

యిప్పుడే బయలుదేరుదామనుకుంటున్నాను. నువ్వా వచ్చావు! పైకిరా, ఏమిటిలా దారితప్పి వచ్చావు.

మరేం లేదయ్యా! మా అమ్మాయికి పెళ్లి కుదిరింది.

సంబంధం ఏవూరుది?

పట్నందిలే. నీతో కాస్త మాట్లాడాల్సిన పనుండి వచ్చాను

అంతేనా. యింకా పెళ్లికి పిలవడానికొచ్చావేమో అనుకున్నాను

మాట్లాడటం అయ్యాక అదీ అనుకో. వీధిలో ఏం

మాటాడతాంగాని లోపలికి పద.

లోపల పంతులున్నాడు. వాడి చెవిసపడితే టముకేసి నట్టే యిక్కడే మాట్లాడటం మంచిది. ఎవరూ లేరుగా. పరవాలేదు చెప్పు.

మరేంలేదయ్యా, పెళ్లింక వారంలోజులుంది. కాస్త డబ్బవసరం. కొంత నాదగ్గరే వుందనుకో. మిగిలింది...

నాదగ్గర ప్రస్తుతం ఏమీలేదయ్యా ?

నీదగ్గర దక్కల్లేదులే, మనబ్యాంకు మీటింగు రేపే నని తెలిసింది. దరఖాస్తుయిచ్చి, అప్పుతప్పకుండా మంజూ రయ్యేలా చూడమని, నీతో చెప్పిపోదామని వచ్చాను.

నువ్వువట్టి సత్తెకాలపువాడివయ్యా సత్తెయ్యా. కోప రేటివ్ బ్యాంకులో అప్పు మీ అమ్మాయి పెళ్లికడిగితే మీ మనవడి బారసాలనా టికివస్తుంది, ఆరుమాసాలక్రితం సాంక్షన్ అయినవాళ్ళకి యిప్పటికింకా దిక్కూదివాణం లేదు. నామాట విని పెళ్లికి బ్యాంకుమీద ఆశపెట్టుకోకు అని సత్తెయ్య ఆశని తుంచేసాడు భూషణం.

పోనీ యింకో దారేమిటో నువ్వేచెప్పాలి భూషణం. లేకపోతే పెళ్లిజరగటం కష్టం. అన్నాడు సత్తెయ్య దిగాలుపడి

నేనుమాత్రం యేం చెప్పగలను చెప్పు? నాదగ్గరా డబ్బులేదుమరి.

సముద్రంలో నీరులేదంటే ఎవరేనా నమ్మొచ్చుగాని

నీదగ్గర డబ్బులేదంటె ఎవరు నమ్ముతారు చెప్పు. నువ్వుతలుచు కుంటే ఎలాగైనా పుట్టించగలవు మరోమాట. నాసంగతి నీకూ తెలుసు. ఊరందరికీ తెలుసు నే నెవ్వరిదగ్గరా నేపుట్టి బుద్దెరి గాక రూపాయి అప్పుచేసి ఎరగను. ఆఖరికి గిద్దెడు విత్తనాలకి గాని, ఓ నాగలికిగాని ఎవరినీ దేహీ అనలేదు. వళ్లువంచి పని చేసి, నా రెం డెకరాలలోనే పరువుగా బతుకుతున్న మనిషిని, ఎంతో గుట్టుగా తరతరాలుగా వస్తూన్న పరువుని కాపాడు కుంటూ రోజులు దొర్లిస్తున్నాను. మాటంటె మాటే. రెండో కంటివాడికి తెలియనివ్వకుండ నీబాకీ పువ్వుల్లోపెట్టి అప్పజెపు తాను అని ప్రాధేయపడ్డాడు సత్తెయ్య.

సత్తెయ్య సంగతి భూషణానికి బాగా తెలుసు. అతని నిజాయితీని చూసే క్రితం బాంకు ఎలక్షన్లో సత్తెయ్యని బ్యాంకు ప్రెసిడెంటు చెయ్యాలని ఊళ్లోని కుర్రకారు ఊగారు కాని సత్తెయ్యే రాజకీయాల్లోకి దిగడానికి నిజాయితీ చాలు గాని, ఎలక్షన్లలో దిగడానికి నిజాయితీ ఒకటే చాలదు. డబ్బు కూడ కావాలి. అందుకు తన స్తోమత చాలదు అని ముందుకు రాలేదని తను విన్నాడు. సత్తెయ్యకున్న ఆ రెండెకరాలు లేకుండాచేస్తే సత్తెయ్య తనకెన్నటికి పోటీకాలేడు. ఊళ్లోని పంచాయతిబోర్డు ప్రెసిడెంటు, మునసబు యిప్పటికే తన గుప్పెట్లో చిక్కుకుని మింగలేక కక్కలేక చస్తున్నారు. వూరు మొత్తంమీద తనదగ్గర అప్పు చేయనివాడు, వానకి తడవని వాడు లేడు. సత్తెయ్య ఒక్కడే యిన్నాళ్లూ తప్పించు కున్నాడు. యీవేళతో ఆనవాయితి పూర్తవుతుంది. జాగ్ర త్తగా యిరికించి తనకి వూరు మొత్తంమీద ఎదురులేకుండా

చేసుకోవాలి అనుకున్నాడు భూషణం. అలా వలలల్లుకుంటూ మౌనంగా వుండిపోయాడు భూషణం.

ఏమిటి నీ అనుమానం భూషణం? మొగమాటపడక చెప్పు అన్నాడు సత్తెయ్య.

అబ్బే ఏం లేదయ్యా, నాదగ్గరైతే డబ్బులేదుగాని, మా పట్నంచెల్లెలు శాంతమ్మలేదూ- ఆవిడ భర్తపోయినప్పటి నుంచి ఏదో కాస్త డబ్బు తే వడ్డీకి తిప్పుకుంటోందిలే. మొన్ననే పంతులు వెడితే కొంతడబ్బు పంపించింది. ఏపద్ధతిలో యిమ్మందో పంతుల్ని అడిగివస్తానుండు అని లేచాడు భూషణం.

కనుక్కొని యెలాగైనా పని జరిగేలా చూడు రెండు మూడు నెలల్లో మళ్లీ యిస్తాను. వెళ్లుబాబు అన్నాడు సత్తెయ ఆత్రంగా.

భూషణం లోపలికెళ్ళి, పంతులుతో ఏదో చెవులు కొరికాడు.

అబ్బ! మీ తెలివి అమోఘమండి అన్నట్టు పంతులు ముఖం చాటంత చేసాడు.

యిద్దరూ బయటకువస్తూ, భూషణం, సత్తెయ్యకు వినబడేటట్టు అంతవడ్డీఅయితే ఎలాగయ్యా? అందులోను మన సత్తెయ్యబోటివాడికి అంతవడ్డే! యెలాకట్టం చెప్పు అన్నాడు పంతులుతో.

మరి చెల్లెమ్మగారు చెప్పినమాట అది - అన్నాడు

పంతులు నిమిత్తమాత్రుడిలా.

అసలు విషయమేమిటయ్యా అన్నాడు సత్తెయ్య.

యేం లేదయ్యా! డబ్బయితే వుందిగాని, నీకు పని జరగదు.

యేం?

యేం ఏమిటి? ఆంత దారుణవడ్డీ యెవడిస్తాడయ్యా! దాని ఆశగాని.

ఎంతట?

నూటికి నెలకి అయిదురూపాయలట.

అయిదురూపాయలా?— ఎక్కువే అనుకో. అయినా మనకి అవుసరం అయినప్పుడు తప్పదుగా. సరేఅలాగే యిద్దాం మళ్లీ రెండుమూడు నెలల్లో తీర్చేద్దాంలే. ఏదోరకంగా.

యింత ఎక్కువ వడ్డీమీద నీలాంటివాడికి...

పరవాలేదులే భూషణం. ఏంచేస్తాం? అవుసరంగదా.

మరి పళ్ళసంగతో అన్నాడు పంతులు నసుగుతూ.

అవును. ఆసంగతే మరచిపోయాను. యీ పెళ్ళిళ్ళు మామిడిపళ్ళ రోజుల్లో రావడం మరీ దారుణం అనుకో సత్తెయ్యా అన్నాడు భూషణం.

పళ్లేమిటి? అన్నాడు సత్తెయ్య అయోమయంగా.

మరేమీలేదయ్యా, ఈ మామిడిపళ్ళకాలంలో అప్పు

తీసుకున్నవాళ్లు రూపాయికి ఓ మామిడిపండు చొప్పున నేమానుగా యివ్వాలని కండిషను పెట్టిందట మా చెల్లెలు. చచ్చ ఆడవాళ్ళదగ్గర అప్పంటె యిదే యిబ్బందనుకో.

సత్తెయ్య కాస్త తటపటాయించాడు. నూటికి అయిదు రూపాయలవడ్డీ, వంద మామిడిపండు కనీసం పది హేనురూపాయలు—మొత్తం నూటికి యిరవైరూపాయలవడ్డీ అని అతను లెక్కించుకునేసరికి అతనికి భయంవేసింది అయినా అవసరం. వత్తిడి, వున్న వ్యవధి తలుచుకునేసరికి ఏది ఎంతైనా తప్పదని నిర్ణయించుకున్నాడు.

సరేలే భూషణం. అలాగే యిద్దాం పెళ్లి ఆగిపోతే పరువేపోతుంది. పరువు ముఖ్యంగాని డబ్బు ముఖ్యంకాదుగా ఫరవాలేదులే, అన్నాడు సత్తెయ్య.

యింతకీ నీకెంతవసరం?

అవుసరానికి అంతేముందిలే. ఆడపిల్ల పెళ్ళంటే ఎంతేన అవుసరం వుంటుంది. కాని యీ వడ్డీమీద, రెండువేలైతే చాలులే. ఏదో సరిపెట్టేస్తాను—పంతులూ యీ అప్పుసంగతి మన ముగ్గురికితప్ప నాలుగోవాడికి తెలియడానికి వీల్లేదు. ఎక్కడేనా నోరు జారావా? జాగ్రత!

రామరామ. నేనెందుకు చెబుతాను?—మరి రాతకోతల సంగతి...

అనుకున్నది అనుకున్నట్టు రాసెయ్. అబద్ధపు రాతలు రాస్తేమాత్రం నే సంతకం పెట్టేవాడినికాదు చూడుభూషణం!

నేనాడి తప్పేవాడిని కాదని నీకు తెలుసు. వాళ్ళకీ వీళ్ళకీ సాక్షిసంతకాలని యీ కాగితం చూపించకు, అని అటు పంతులికి, యిటు భూషణానికికూడ ఖచ్చితంగాచెప్పాడు సత్తెయ్య.

దాంతో భూషణం యివన్నీ ఎందుకయ్యా రాతలూ వద్దూ కోతలూవద్దు అనుకున్న ప్రకారం వడ్డీ అసలు, పళ్లు రెండు నెలల్లో వప్పచెప్పెయ్. మా శాంతమ్మకి పంపిచేస్తాను. పంతులూ, సత్తెయ్యకి డబ్బిచ్చిపంపించు అని విషయాన్ని సాగ తీయకుండా తేల్చేసాడు.

సత్తెయ్య డబ్బు తీసుకునేందుకు పంతులుతోబాటు లోపలికెళ్లాడు. యింత కాలానికి సత్తెయ్యకూడ తన గుప్పెట్లో చిక్కినందుకు కొండెక్కి పిండి కొట్టినంత ఆనందంగా వుంది భూషణానికి. యింత వడ్డీమీాద ఈ బాకీ తీర్చడం వాడి తరం కాదనుకున్నాడు. నిజాయితీకి నిక్కచ్చికి కట్టుబడి ఆ రెండెక రాలు తన పరం చేసి ఘనంగా బతికే సత్తెయ్య బికారి సత్తెయ్య కావటం ఖాయం అనుకున్నాడు భూషణం. తనమీాదకే పోటీ నిలబడడానికి సిద్ధమైన సత్తెయ్య యీ రెండకరాలు పోయాక, ఏమాత్రం అసలా విషయం గురించి ఆలోచించగలడో చూడాలి అనుకున్నాడు భూషణం. మొత్తానికి సత్తెయ్య పూర్తిగా తన గుప్పెట్లో యిరుకున్నట్టే తృప్తిపడ్డాడు భూషణం.

సత్తెయ్య రెండువేల రూపాయలు తీసుకొని వెళ్ళి పోయాడు.

పత్రం పాడూ లేకుండా యింత సొమ్ము జారవిడుచు కోవడం... అని పంతులు గొణిగాడు.

పత్రంలో యీ వడ్డీ, పళ్ళ సంగతి ఉదహరిస్తే చెల్లుతుందా? వెధవా కప్ప మెదడూ నువ్వూను. పోనీ, యిచ్చిన దానికంటె ఎక్కువకు పత్రం రాయిస్తే అతగాడు సంతకం పెడతాడా ? అతను మాటంటె మాటె. వాళ్లవంశమే అంత. లేనిపోని అనుమానులు రేపి నామనసు పాడుచెయ్యకు పోయి పనిచూచుకో అని గుండెదిట్టపరచుకున్నాడు భూషణం.

మొత్తానికి కాళ్ళకి జిగురురాసి మరీ బంధించారు చిలకని పంజరంలో, తెలివంటే మీది ! యింక భూషణంగారి భోషాణానికి సత్తెయ్య రెండకరాలు సమర్పయామి అన్నాడు పంతులు-

పోనీలేగానీ తప్పుడు మంత్రాలు చదవకు. బెడిసి కొట్టగలవ్.

మంత్రాలలో తప్పా ! నేనా ! ఉగ్గుపాలతో వచ్చిన విద్యకదండీ, వస్తా! అని లోపలికి పోయాడు పంతులు.

○ ○ ○

సత్తెయ్య కూతురు పెళ్ళి ఘనంగా జరిగిపోయింది. అమ్మాయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. రెండు మాసాలు చీటికలో గడిచిపోయాయి. సత్తెయ్యకి, వట్టినమ్మకం ఆధారంగా యిచ్చిన బాకీమూలాన రెండు నెలలు రెండు యుగాలుగా గడిచాయి భూషణానికి.

భూషణం దగ్గరనుంచి సత్తెయ్యకి కబురొచ్చింది.

సత్తెయ్య ఓనాటి పొద్దున్నే వచ్చాడు భూషణం యింటికి.

మా శాంతమ్మ కబురంపింది. అసలు అందకపోతే కనీసం పళ్ళో, వడ్డీయేనా అందజేస్తే అవిడకిపంపించేస్తాను, అసలు మరో రెండునెలలు ఆలశ్యమైనా, తరువాత వడ్డీతోనే పంపించొచ్చు-ఎంతో బుజ్జగింపుగా చెప్పాడు భూషణం.

ఉళ్ళో పళ్ళు అయిపోయాయి. పట్నం వెళ్ళి తేవాలి. త్వరలోనే పంపిచేద్దాం- అన్నాడు సత్తెయ్య ముక్తసరిగ.

సరే త్వరగా చూడు.

అలాగే అని వచ్చేశాడు సత్తెయ్య.

రెండువేల పళ్ళు ఒకసారి యేంచేసుకుంటుందిశాంతమ్మ మాత్రం. అమ్ముకొని సొమ్ము చేసుకోడమేగా. పళ్ళు దొరక పోతే ఏదో ధర ప్రకారం సొమ్ము ముట్ట చెప్పొచ్చు- అను కున్నాడు సత్తెయ్య.

మర్నాడు సత్తెయ్య పట్నాని కెళ్ళాడు. మామిడిపళ్ళ టోకుకొట్ల దగ్గరకెళ్ళి చూసేసరికి పళ్ళు అంతమంచివిలేవు. పళ్ళు తగ్గుముఖం పట్టాయి. ఉన్నవాటిలోనే మంచివి ఓ వంద పండ్లు కొని శాంతమ్మ యింటికి పట్టు కెళ్ళాడు సత్తెయ్య.

శాంతమ్మకి సత్తెయ్య కొత్తమనిషి కాకపోవడంతో తన పుట్టింటి గ్రామంవాడు కావడంతో ఎంత ఆప్యాయంగా ఆహ్వానించింది. పలకరించింది.

పళ్ళబుట్ట-లోపల పెట్టించి, ఆలశ్యమైపోయింది. అన్ని పళ్ళూ ఓకేసారి తెస్తే పాడైపోతాయనీ, పైగా మంచి పళ్ళు

లేకపోవడంచేతా, ఒక వంద పళ్ళు మాత్రమే తెచ్చాను. మిగిలినవాటికి ధర ప్రకారం చూసుకుందాం- అన్నాడు సత్తెయ్య వినయంగా.

శాంతమ్మకేమీ అర్థంకాలేదు ఏమిటి - బాబాయ్ నువ్వనేది? పళ్ళేమిటీ? ధర కట్టుకోవడమేమిటీ?- అంది ఆశ్చర్యంగా.

సత్తెయ్యకి శాంతమ్మ అప్పు యివ్వలేదన్న విషయం స్పష్టంగా అర్థమైంది. భూషణం తన మంచితనం చెరుపుకోకుండా చెల్లెల్ని అడ్డుపెట్టుకున్నాడని సత్తెయ్య గ్రహించాడు అయినా విషయాన్ని అక్కడితో అవకుండా విపులంగా తేల్చుకునేందుకు- అదేనమ్మా! మీరిచ్చిన అప్పుకి రూపాయికి ఓ మామిడిపండు చొప్పున కావాలన్నారట మీరు- అన్నాడు సత్తెయ్య.

భలేవాడివే బాబాయ్! నేను యింకొకళ్ళకి అప్పు యివ్వడమా? అయ్యోరాత! అంత అదృష్టంకూడానా? మొన్నీమధ్య నాకే డబ్బవసరం వచ్చి అన్నయ్యకి కబురంపితే, ఎవరిదగ్గరో వెయ్యి రూపాయలు తీసుకొని పంపించాడు. నూటికి అయిదు రూపాయలు వడ్డీ అట. పైగా రూపాయికి ఓ మామిడిపండు నేమానట. యిదెక్కడిది దారుణం బాబాయ్. ఈ పట్టణంలోనూ అప్పులు యిస్తారుగాని- కావలిస్తే వడ్డీ ఎక్కువడుగుతారుగాని యిలా పళ్ళు నేమానడగడం లేదు. అది మీ వూరులాంటి పల్లెటూళ్ళకే చెల్లిందేమో. మామిడి పళ్ళంటే ఏమైనా రేగిపళ్ళో, చింతగింజలో అనుకుంటారేమో.

మీ వూరివాళ్లు... అంది శాంతమ్మ కాస్త ఆవేశంగా.

సత్తెయ్య ఆమె మాటలకి నవ్వుకున్నాడు.- అలాంటప్పుడు మరెక్కడేనా తీసుకోపోయావా? అన్నయ్యద్వారా మానేసి-అన్నాడు సత్తెయ్య.

నేను మీవూళ్లో పుట్టి పెరిగినదాన్నేగా బాబాయ్! నాకు చదువా చట్టుబండలా. ఆయన పోయిననాటినుంచీ ఈ గడప దాటెరగను, స్వంతయిల్లు వదల్లేక, పిల్లల చదువులకోసం ఇక్కడే పడుంటున్నాను, మగదిక్కు లేక పోవడంతో, యీ పట్టణంలో అప్పు కెడితే నా తెలియనితనాన్ని చూసి ఎంతిచ్చి ఎంతకు రాయించుకుంటారో ఏమో ఎందుకు లెమ్మని అన్నయ్యకి కబురంపాను. తోడబుట్టిన వాడంటూ ఒకడున్నాడు కదా అని ఎలాగో అలా మాట దక్కించాడు పాపం!- అంటూ సొద విడేసింది శాంతమ్మ.

అంతేలే అమ్మా! అవుసరం అలాంటిది. ఏంచేస్తాం. మరి నేవస్తానమ్మ. యీ పళ్లు పిల్లలికి వుంచు-అని బైలు దేరాడు సత్తెయ్య.

అదేంటి బాబాయ్ యిన్ని పళ్లు నాకెందుకులే. నీకు మాత్రం వూరికే వస్తాయా యేమిటి? తీసుకెళ్లు, మీ పిల్లలూ తింటారు- అని పది పళ్లకంటె శాంతమ్మ తీసుకోలేదు.

మిగిలినపళ్లు తీసుకుని సత్తెయ్య బజారుకు వచ్చేసి, కాస్త తక్కువ ధరకి ఆ పళ్లు యిచ్చేసి యింటిముఖం పట్టాడు. తన దగ్గర భూషణం అబద్దమాడినా అతనికంత బాధ అనిపించ

లేదు సత్తెయ్యకి. స్వంతచెల్లెల్నికూడ అట్టేపెట్టనందుకు వళ్లు మండిపోయింది తనకి - జలగకి రక్తం కావాలి, ఎవరిదైనా ఫరవాలేదు_అనుకున్నాడు.

వూళ్లోకి రాగానే, యింటికేనా వెళ్లకుండా, ఎకాఎకిని భూషణం ఇంటికెళ్లాడు సత్తెయ్య, తలుపుతట్టి భూషణాన్ని లేపాడు.

భూషణం బయటకొచ్చి యింత చీకటిని వచ్చేవేం? తెల్లారేక రాకపోయావా? యిప్పుడు పళ్లు తెచ్చినా తెల్లారితేగాని పట్నానికెళ్లవుగా? అన్నాడు కళ్లు నులుపుకుంటూ.

డబ్బు అప్పిచ్చినోళ్లు యిక్కడుంటే పళ్లు పట్నానికెళ్లడం దేనికి?_ అన్నాడు సత్తెయ్య వెటకారంగా.

భూషణం కాస్త కంగారుతిని,_ ఏమిటి నువ్వనేది?- అన్నాడు.

ఉన్నమాటే అప్పు నివ్విచ్చి మధ్య చెల్లెలి నెందుకు అడ్డెట్టుకోడం? అక్కడికి నువ్వు ధర్మరాజులా అగుపించాలి, అంతేకదూ. ఆ ధర్మరాజుది మాత్రం తక్కువే ముందిలే! తోటి తమ్ములున్నారు, పెళ్లాంవుంది, రాజ్యవే, ప్రజలది అనేనా ఆలోచించకుండా సొంతంలా జూదం ఆడేశాడు, అన్నమాట ప్రకారం తను చేసిన నేరానికి తమ్ముళ్లని, తల్లిని, పెళ్లాన్ని అడవులంట తిప్పి ధర్మరాజయ్యాడు; పెద్దాడ్ననిపించుకున్నాడు;

ఈ భారతం అంతా ఎందుకులేగాని, నువ్వు చిరాగ్గా

వున్నట్టున్నావు. పొద్దునే రా మాట్లాడదాం? అని లోపలికి పోబోయాడు భూషణం.

నాకేం చిరాగ్గా లేదు. వినాల్సిన మాటలు నాలుగూ విని పడుకో. యీ సొమ్ము నీదంటే యింత వడ్డీ, యీ పళ్ళూ నీకివ్వనని భయమూ నీకు? పోనీ నా సంగతి సరే నేను పరాయివాడిని, సొంత చెల్లెలుకి కూడా యిలాగే వడ్డీకట్టి పళ్ళడుగుతావా? ఛీ. నీది ఓ బతుకేనా బతికావు లుచ్చా బతుకు నమ్మినాళ్ళని, మంచాళ్ళని జలగలా పీల్చుకుతిని, నువ్వేం బాగుపడతావ్? నేను నిజాయితీ ఉయినవాడినని పత్రం లేకుండా అప్పు ఇచ్చావు. యిప్పుడు నేనివ్వక్కర్లే అంటే నువ్వు చేసేదేమిటి! నోరెత్తి బాదుకుంటావు. అంతేగా బతికావు బతుకు. ఛీ." అని తుపుక్కున ఊసి యింటికొచ్చేశాడు సత్తెయ్య.

భూషణం ఒక్క క్షణం నిశ్చేష్టుడై పోయాడు నోట మాటరాలేదు. ఆడిన నాటకం బయటపడిపోయినందుకు తబ్బిబ్బయ్యాడు. తనకి వూహ తెలిసినాటినుంచి యింతవరకూ ఎవ్వరూ యిన్నిమాటలనలేదు తనని. గౌరవం పొందడమే గాని అగౌరవింపబడి ఎరగడు తను. చాటున ఎవరెట్లా ఏడిశారో తనకనవసరం. జరిగిన అవమానం చీకట్లోనే అయినా, తలచుకొనేకొద్దీ వళ్ళు కంపరమెత్తి పోతోందతనికి. "యింతకింత పగ తీర్చుకోవాలి, ఈ బాకీ ఈ వడ్డీమీద యిప్పుడు కాదుకదా మరో జన్మెత్తినా తీర్చలేడు వీడు. అయితే రాతమూలకంగా యేం లేదు. కాబట్టి తప్పుకుపోతాడా అన్నదే అనుమానం. సరే, తెల్లవాంనీ వీడిసంగతి చూస్తాను.

ఊరంతా నా వెనకుందిగాని, ఈ హరిచంద్రుడి వెనక లేదు ప్రెసిడెంటు, మునసబు, మెంబర్లు, చిన్నా పెద్ద అంతా నాకు బాకీపడి, గుప్పెట్లో వున్నవాళ్ళే. వాళ్ళందరిముందు వీడ్ని నిలేసి వీడి పరువుతీసి, పత్రం రాయించి వీడి సంగతి తేలుస్తాను. ఈ వూళ్ళోనే వీడ్ని కూలిపనికి పంపించకపోతే నేను భూషణాన్నే కాదు' అని తనలో తానే ప్రతిజ్ఞలు చేసుకున్నాడు.

యింక అతనికి నిద్రపట్టలేదు. మర్నాడుకూడా ఎందుకనో ఏమీ నిర్ణయించుకోలేక వూరుకున్నాడు. ఆ రెండు రోజులూ పిచ్చెక్కినవాడిలా వుండిపోయాడు భూషణం.

మూడవరోజున, తెగించి పంచాయతీ ఆఫీసు దగ్గరకెళ్లి ప్రెసిడెంటుతోటి, మునసబు కరణాలతోటి, యితర పెద్దలతోటి విషయాన్ని అందంగా చెప్పి, తగవుపెట్టాడు.

పెద్దలంతా సాటి పెద్దమనిషి గోడువిని, జాలిపడి గ్రామ నౌకరుచేత సత్తెయ్యకు కబురంపారు, యీలోగాజనం క్రమేణా తగవు అనేసరికి సరదాగా కాలక్షేపంకోసం, అందులోనూ సత్తెయ్యలాంటి పెద్దమనిషికీ, భూషణానికి మధ్య తగవని, ఆఫీసుదగ్గరికి ఎక్కువగా చేరారు.

సత్తెయ్యకోసం వెళ్లిన నౌకరు తిరిగివచ్చి "పట్నంనుంచి యిప్పుడే వచ్చారటండి. కూసేపట్లో వత్తానన్నారండి" అని చెప్పాడు.

సత్తెయ్య ఓ గంట తరువాతకాని రాలేదు. వచ్చీ రాగానే 'పట్నంనుంచి రాగానే నౌకరు వచ్చాడు. కాళ్లూ చేతులూ కడుక్కొని భోంచేసిరావడం కాస్త ఆలశ్యంఅయింది.

యింతకీ ఏమిటి సంగతి ?' అన్నాడు ప్రెసిడెంటు నుద్దేశించి సత్తెయ్య.

''మరేంలేదు సత్తెయ్యా! మన భూషణం – నువ్వు నాలుగువేల రూపాయలు బాకీ వున్నావు, ఎన్నిసార్లడిగినా యివ్వకంలేదు. పిలిపించి అడగమన్నాడు'' అన్నాడు ప్రెసిడెంటు.

''మీ అమ్మాయి పెండికని తీసుకున్నావంటున్నాడు'' అన్నాడు మునసబు.

''ఓరోజు ఆలశ్యంకావచ్చుగాని, యివ్వాల్సింటె అన్నమాటప్రకారం యిచ్చేస్తాడు సత్తెయ్య అన్నాం అనుకో అన్నాడు కరణం.

అంతా విని, ''అంతేనాండి ?'' అన్నాడు సత్తెయ్య.

''అంతే–'' అన్నాడు ప్రెసిడెంటు,

''అయితే నా మనవికూడా వినండి పెద్దలంతా. నేనీ వూరికి కొత్తకాను. మా తాతలనాటినుంచీ యీవూళ్లో బతికినవాళ్ళమే. మా వంశంసంగతి మీ కందరికి తెలుసు. మా తాతనాడు పదెకరాలుంటే నాదగ్గర కొచ్చేసరికి రెండెకరాలయ్యింది. మా తాతకి మా నాన్నొక్కడు. మా నాన్నకి నేనొక్కడ్ని. అయినా భూమి యిలా తరిగింపోయిదంటే కారణం మాట నిలుపుకోడంకోసం, పరువు నిలుపుకోడంకోసం, ఆస్తిని లెక్కచెయ్యకపోవడమేనని మీకందరికి తెలుసు. అందుకే ఆస్తి తరిగినా మా వంశానికి పరువు పెరుగుతూనే వచ్చింది. యింతవరకూ మా పెద్దలుకాని, నేనుకాని భూమిపన్ను

రూపాయికూడా బకాయి పెట్టలేదని మునసబు రకణాలకి తెలుసు పంచాయతి బోర్డుకికూడ ఎన్నడూ పైసాకూడ ఏ పన్ను బకాయి పెట్టెరగను. యీ వూళ్లో ఎవర్నీ యింతవరకు దేనికి అప్పు అడిగెరగను. పదేళ్ళక్రితం నా పెద్దకూతురు పెళ్ళయింది. ఆనాడూ అప్పు చెయ్యలేదు. పదేళ్ళ తరువాత మళ్లీ యీ యేడు మా చిన్నమ్మాయి పెళ్ళయింది. యీ పెళ్లికి అప్పుచేసానని భూషణం అంటూన్నాడని మీరంతా అంటున్నారు. మీలో చాలామంది భూషణం దగ్గర అప్పు చేసే వుండొచ్చు. భూషణం డబ్బున్నవాడేకావచ్చు అంత మాత్రంచేత నేనూ అప్పుచేసేనని మీరంతా అంటే నాకున్న రెండెకరాలలో ఓ ఎకరం తెగనమ్మి మీ ముందు డబ్బు గుమ్మరిస్తాను. ఎన్నడూ దేనికీ ఎవరినీ అడగనివాణ్ని అప్పు చేశానని మీరంతా నమ్మితే నేను దేనికైనా సిద్ధమే?

"మేమంతా నమ్మటం సంగతి కాదయ్యా! నీ నిజాయితీ సంగతి మాకు తెలియందా? యింతకీ నువ్వు యివ్వాలా అక్కర్లేదాఅని అడుగుతున్నాం?" అన్నాడు మునసబు.

"అయితే నేనబద్ధమాడతానా?" అని తోక తొక్కిన తాచులాలేచాడు భూషణం.

అని ఎవరన్నారయ్యా? తగవు అన్నప్పుడు రెండు పక్కలా విని తీర్పు చెప్పాలిగాని ఓ పక్క చెప్పినదాని ప్రకారం చెబితే ఎలాగయ్యా? అన్నాడు కరణం.

కావలిస్తే పంతులుని అడగండి–అన్నాడు భూషణం.

పంతులు సాక్ష్యం నమ్మాలంటే, ఓ ఎడాదిపాటు

నీదగ్గరనుంచి గుమస్తాగా తీసేసి తరువాత చెప్పమను ఏ సాక్ష్య మెనా అన్నాడు సత్తెయ్య.

ఆ మాట నిజమే. యింట్లోవాళ్ళ సాక్ష్యానికి, పనివాళ్ళ సాక్ష్యానికి అంత విలువ కోర్టులోనూ ఉండదు - అన్నాడు కరణం.

ఔను ! కోర్టంటే జ్ఞాపకం వచ్చింది. మమ్మల్ని యిలా యిరకాటంలో పెట్టకపోతే రాని బాకీలన్నింటికి మల్లేనే యీ బాకీని కోర్టుకి తీసుకుపోబోయావా భూషణం. కిందకోర్టు నుంచి హైకోర్టుదాకా నీకు కొట్టిన పిండేగదా అన్నాడు మునసబు, పెద్దహితవుకోరి సలహాయిచ్చినట్టు.

ఏం పట్టుకుని వెళ్ళమంటావు కోర్టుకి.

అంటే? అన్నాడు ప్రెసిడెంటు.

ఏ పత్రం పాడూ రాయించుకోలేదు కాబట్టే మీవెంట పడాల్సివచ్చింది–అన్నాడు భూషణం.

పత్రంలేకుండా నువ్వు అప్పు యిచ్చేవా! అన్నాడు మునసబు నమ్మలేనట్లు.

ఆ(, యిచ్చాను. సత్తెయ్య మీ అందరిలాంటివాడూ కాదని యిచ్చాను–అన్నాడు కసిగా భూషణం.

కామలే. పత్రంవుంటే పత్రంలో ఎంతుందో అంతే పుచ్చుకోవాలి, పత్రం లేకపోతే తగువు సెప్పేవోళ్లు మనోళ్లే గాబట్టి ఎంతవీలైతే అంతా పుచ్చుకోవచ్చని రాయించుకుని

వుండదు పత్రం - అన్నాడు ఓడిపోయిన పంచాయితీబోర్డు ప్రెసిడెంటు.

జనం గొల్లుమని నవ్వారొక్కసారి.

దాంతో ప్రెసిడెంటుకి కోపం వచ్చింది. పత్రంలేంది మేఁ వేమీ చెయ్యాలేం భూషణం-అన్నాడు.

యింతకంటె మీరు చెయ్యగలరని నేనూ అనుకో లేదు, అని లేచి విసురుగా వెళ్ళిపోయాడు భూషణం. పంతులు తోకలా వెంబడించాడు. లౌకికం! తెలివి ఓడిపోడంతో వుడుకుమోత్తనం విజృంభించింది భూషణం గుండెల్లో. పగ అడ్డు దారులు వెదుకుతోంది. కుప్పకి నిప్పటించడం, చాటుగా కిరాయి రౌడీలచేత తన్నించడం, పంటచేను రాత్రికిరాత్రి కోయించేయడం, ఏదో కేసులో యిరికించడంలాంటి ఆలోచనలు మెదడునిండా తుట్టలు తుట్టలుగా అలుముకుంటున్నాయి భూషణానికి. భూషణం, పంతులు యిల్లు చేరుకున్నారు. ఆ వెధవ యీగని మనమనుకుంటే, బల్లిలా మీదపడి సాలి పురుగునే తినెయ్యాలని చూశాడు. అన్నాడు పంతులు పెద్ద తెలివి వుపయోగించి. ఛీ నోర్మూయ్. నన్ను సాలిపురుగంటావు! యేపులితోటో సింహంతోటో పోల్చక, అసలు నా కెదురుగా కనపడకు. ఫో అవతలికి, అని కసిరాడు భూషణం. పంతులు వాతావరణం బాగా లేదని జారుకున్నాడు.

భూషణం వంటరిగా హాల్లో కుర్చీలో పడుకుని వ్యూహాలు పన్నుతున్నాడు. గుండెలు మండుతున్నాయి. కళ్ళెర్రబడ్డాయి. కాని ఓ నిర్ణయానికి దేనికీ రాలేక పోతున్నాడు.

యింతలో లోపల్నించి అతని భార్యవచ్చి, ఏమిటి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు. యిదిగో లెక్క చూసుకోండి. అని డబ్బు కట్టలుపట్టుకొచ్చి అతని వళ్లోపడేసింది.

ఎక్కడిదీ ?

మీారు బయటకు వెళ్ళగానే సత్తెయ్య వచ్చి యిచ్చి వెళ్ళాడు అబద్ధానికి ఆడితప్పినదానికి, వడ్డీపళ్ళు చెల్లని చెప్పమన్నాడు. అని లోపలికెళ్ళింది ఆమె

క్షణం క్రితంవరకూ మనుషులంతా దొంగలే అనుకున్న భూషణం యీాస ఘటన జరిగినతరువాత తన అభిప్రాయాన్ని మళ్ళీ మొదటినుంచీ పరిశీలించాల్సి వచ్చింది.